అభివృద్ధే ధ్యేయంగా పాలన

- పలు అభివృద్ధి పనులు ప్రారంభించిన ధర్మశ్రీ


బుచ్చెయ్యపేట మండలం రాజుపాలెంలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన విప్ ధర్మశ్రీ


జన్నవరం-బుచ్చెయ్యపేట రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: అభివృద్ధే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేస్తుందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. చోడవరం పట్టణంలోని పలు వార్డుల్లో ఇంటి కుళాయిలను ఆయన గురువారం ప్రారంభించారు. జన్నవరం వయా బెన్నవోలు రోడ్డుకు రూ.1.20 కోట్లతో చేపట్టనున్న రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం నర్సయ్యపేటలో కలాసీలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో చేసినంత అభివృద్ధి ఏ ప్రభుత్వ హయాంలోనూ కాలేదన్నారు. సంక్షేమ, అభివృద్ధి లక్ష్యంగా పనిచేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజలు పూర్తిస్థాయిలో మద్దతు ఇవ్వాలన్నారు. ఇళ్లులేని నిరుపేదలందరికీ సొంతింటి కల నిజం చేయాలన్నదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమన్నారు. చాలా ఏళ్లుగా జన్నవరం వయా బెన్నవోలు, బుచ్చెయ్యపేట రోడ్డును బాగుచేయకపోవడంతో చాలా ఇబ్బందులు పడేవారని, ఇప్పుడు ఆ రోడ్డును కొత్తగా నిర్మిస్తున్నామన్నారు. త్వరలోనే పనులు వేగవంతమవుతాయన్నారు. పనిచేసే కార్యకర్తలకు పార్టీలో గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, తహసీల్దార్ వేణుగోపాలరావు, ఎంపీపీ గాడి కాసు, సర్పంచ్‌లు బండి నూకాలమ్మశ్రీను, ఉప సర్పంచ్ పుల్లేటి వెంకట్రావు, నాగులాపల్లి రాంబాబు, మూడెడ్ల శంకరరావు, కోసిన సన్యాశి రావు, సాలాపు శ్రీను, పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి సత్య, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

మారుమూల గ్రామాలకు రోడ్డు సదుపాయం

బుచ్చెయ్యపేట: నియోజకవర్గంలో మారుమూల గ్రామాలకు రోడ్లు ఏర్పాటు చేసి ప్రజలకు రవాణా సదుపాయం కల్పిస్తున్నానని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. గురువారం రాత్రి ఆయన రూ.2 కోట్లతో నిర్మించే పీపీ అగ్రహారం నుంచి రాజుపాలెం రోడ్డు, కోటి రూపాయలతో నిర్మించే కేబీ రోడ్డు నుంచి గొన్నవానిపాలెం రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఎర్రవాయి ప్రాంతమైన బుచ్చెయ్యపేట మండలంలోని అన్ని గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించానన్నారు. ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా తనని రెండోసారి గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు జోగా కొండబాబు నాయకులు కోరుకొండ అప్పలనాయుడు, పినపోలు రామునాయుడు, ఎల్లపు విజయ్‌కుమార్, గొలజాన శ్రీను, వెంకటపతిరాజు, వజ్రపు బాబూరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆలయాల నిర్మాణానికి భూమిపూజ


పోలవరంలో భూమిపూజ చేస్తున్న జెడ్పీటీసీ, నాయకులు

గొలుగొండ: మండలంలో నూతనంగా మంజూరైన ఆలయాల నిర్మాణానికి గురువారం భూమిపూజ కార్యక్రమాలు నిర్వహించారు. వెంకటాపురంలో అడవిరాజులబాబు గుడి, పోలవరంలో అభయాంజనేయ స్వామి, ఏఎల్‌పురం, చీడిగుమ్మల గ్రామాల్లో ఆలయాలు మంజూరయ్యాయి. జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ ఆధ్వర్యంలో భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతీ గ్రామంలో ఆలయాలు మంజూరుకు కృషి చేసిన నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వీఆర్వో మృతికి సంతాపం


వీఆర్వో సూరిబాబు(ఫైల్)

మాకవరపాలెం: శెట్టిపాలెంలో వీఆర్వో లాలం సూరిబాబు(35) మృతికి పలువురు సంతాపం తెలిపారు. కోటవురట్ల మండలం రాజుపేటలో వీఆర్వోగా పనిచేస్తున్న ఆయన కొద్ది రోజులుగా అనారోగ్యం బాధపడుతున్నాడు. ఈ క్రమంలో విశాఖలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించినట్టు కుటుంబ సభ్యులు గురువారం తెలిపారు. సూరిబాబు మృతికి రెవెన్యూ సిబ్బందితో పాటు గ్రామస్తులు సంతాపం తెలియజేశారు.

కొత్తకోటలో కేంద్ర బలగాల కవాతు


కవాతు చేస్తున్న పోలీసు బలగాలు

రావికమతం: సార్వత్రిక ఎన్నికల కోడ్ రానున్న నేపథ్యంలో పకడ్బందీగా కోడ్ అమలు, ఎన్నికల నిర్వహణకు గానూ కేంద్ర సాయుధ బలగాలు కొత్తకోట గ్రామానికి గురువారం చేరుకున్నాయి. కొత్తకోట సీఐ అప్పలనాయుడు ఆధ్వర్యంలో భారీ కవాతు నిర్వహించారు. సజావుగా ఎన్నికల నిర్వహణకు అంతా సహకరించాలని ఈ సందర్భంగా సీఐ కోరారు.

వల్సంపేటలో 15 మంది బైండోవర్


మాట్లాడుతున్న తహసీల్దార్ రమేష్‌కుమార్

నాతవరం: బైండోవర్ చేశాక మరలా తగదాలు పడితే జైలుకు పంపిస్తామని తహసీల్దార్ ఎస్. రమేష్‌కుమార్, ఎస్ఐ రామారావు హెచ్చరించారు. వల్సంపేటలో ప్రభుత్వ భూమి ఆక్రమణ విషయంలో ఇరువర్గాల వారు ఘర్షణ పడుతున్నారు. ఈ సమస్య తీవ్రత స్థాయికి చేరుకోవడంతో గురువారం తహసీల్దార్, ఎస్ఐ కౌన్సెలింగ్ చేశారు. వారిలో మార్పు రాకపోవడంతో 15 మందిని బైండోవర్ చేశారు. ఎన్నికలు నేపథ్యంలో పంచాయతీలో మరి కొంతమందిని బైండోవర్ చేస్తామన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ


ర్యాలీలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ

దేవరాపల్లి: ఓటుహక్కు వజ్రాయుధమని, దాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగించుకోవాలని తహసీల్దార్ లక్ష్మీనారాయణ సూచించారు. ఓటు హక్కు వినియోగంపై వైఎస్సార్ క్రాంతి పథం(వెలుగు), రెవెన్యూ సిబ్బందితో కలిసి గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి స్థానిక నాలుగు రోడ్ల కూడలికి ర్యాలీగా చేరుకుని, అక్కడ మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. 18 ఏళ్లు నిండిన యువత ఓటు హక్కు పొందాలని సూచించారు. వైఎస్సార్ క్రాంతి పథం ఎస్. ప్రభాకర్, సీసీ గౌరీష్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

అన్నివర్గాల అభ్యున్నతికి కృషి

మాకవరపాలెం: అన్నివర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని తూర్పుకాపు సంఘ మండలాధ్యక్షుడు గొంతిన హరిబాబు, వైస్ ఎంపీపీ లక్ష్మి తెలిపారు. ఈబీసీ నేస్తం నగదు విడుదల సందర్భంగా గురువారం తామరం సచివాలయంలో లబ్ధిదారులతో కలసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజలు వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. సర్పంచ్ చెల్లారత్నం, నాయకులు పాల్గొన్నారు.

ఏ సమయంలోనైనా ఎన్నికల ప్రకటన


మాట్లాడుతున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: సార్వత్రి ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సన్నద్ధం కావాలని ఆర్డీవో హెచ్.వి.జయరాం తెలిపారు. నియోజకవర్గం సెక్టోరియల్ అధికారులతో గురువారం ఆయన సమావేశమయ్యారు. ఏ సమయంలోనైనా ఎన్నికల ప్రకటన వెలువడే అవకాశం ఉన్నందున నిర్వహణకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎన్నికల విధుల పట్ల ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం వహించొద్దన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు పోలింగ్ నిర్వహించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్‌పై సెక్టోరియల్ ఆఫీసర్లకు అవగాహన కల్పించారు.

చదువుతోపాటు విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ


విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని చేస్తున్న ఎంఈవో ప్రసాద్

కె.కోటపాడు: విద్యార్థుల చదువులతోపాటు వారి ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యమివ్వాలని ఎంఈవో డీవీడీ ప్రసాద్ తెలిపారు. ఎ.కోడూరు ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు జరిగిన సిలబస్‌తోపాటు వర్కు పుస్తకాల నిర్వహణ, కరెక్షన్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రక్తహీనత సమస్యను అధిగమించేందుకు ఐరన్ మాత్రలతోపాటు గుడ్డు, రాగి జావతోపాటు సమతుల్య ఆహారం తీసుకోవాలన్నారు. ఈ విషయమై హెచ్‌ఎం ప్రవీణ్‌ను అడిగి తెలుసుకున్నారు. చదువుల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి సులభరీతిలో అవగతమయ్యేలా బోధించాలన్నారు.

గణితానికి ఎంతో ప్రాముఖ్యత


విద్యార్థులు తయారు చేసిన పై సింబల్‌తో ఉపాధ్యాయులు


మాకవరపాలెం: నిత్య జీవితంలో గణితానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని హెచ్‌ఎం కె.రాము అన్నారు. గురువారం తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో అంతర్జాతీయ గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన పై సింబల్‌ను ప్రదర్శించారు. అనంతరం హెచ్‌ఎం రాము మాట్లాడుతూ గణితంలో విద్యార్థులు పట్టు సాధించాలన్నారు. ఇందులో ప్రతిభ చూపితే భవిష్యత్‌లో ఉన్నతంగా రాణిస్తారన్నారు. గణిత సూత్రాలను వేగంగా చెప్పిన విద్యార్థులు గోపాల్, మోహన్‌లను అభినందించారు. ఉపాధ్యాయులు లోవరాజు, సంతోషి, నారాయణరావు పాల్గొన్నారు.

వడ్డాది హైస్కూల్‌ను అభివృద్ధి చేద్దాం


మాట్లాడుతున్న రిటైర్డ్ ఎస్ఐ రమణ

బుచ్చెయ్యపేట: ఎంతోమందికి మంచి చదువులందించి ప్రయోజకుల్ని చేసిన వడ్డాది హైస్కూల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దడానికి పూర్వ విద్యార్థులు తీర్మానించారు. మేజర్ పంచాయతీ వడ్డాది కోవెల అప్పనదొర జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1964 నుంచి చదివి పలు ఉన్నత స్థాయి ఉద్యోగాలు చేసి పదవీ విరమణ పొందిన పలువురు పూర్వ విద్యార్థులు గురువారం వడ్డాదిలో కలుసుకున్నారు. ఈ నెల 24న ఇక్కడ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు రిటైర్డ్ ఎస్ఐ ఎస్.వి.రమణ, నీటి పారుదలశాఖ రిటైర్డ్ ఈఈ పోలేశ్వరరావు, రిటైర్డ్ ఎస్ఐ ఎం ధర్మజ్యోతి, జీవీఎంసీ రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్ పి. ఈశ్వరుడు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, రిటైర్డ్ కోఆపరేటివ్ సెక్రటరీ సయ్యపురెడ్డి వరహాలబాబు తదితరులు తెలిపారు. జిల్లాలోనే పెద్దదైన వడ్డాది హైస్కూల్‌లో 12 గ్రామాలకు చెందిన 900 మంది విద్యార్థులు విద్యా బోధన చేస్తున్నారన్నారు. పూర్వ విద్యార్థులంతా సంఘంగా ఏర్పడి పాఠశాల అభివృద్ధితోపాటు మెరిట్ సాధించిన పేద విద్యార్థుల ఉన్నత చదువులకు సహకరించాలని తీర్మానించారు.

ప్రకృతి సాగుతో మేలు


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ శైలజ

రోలుగుంట: ప్రకృతి సాగుతో రైతులకు మేలు జరుగుతుందని బీసీటీ కేవీకే శాస్త్రవేత్తల హెడ్ డాక్టర్ శైలజ కుర్రా తెలిపారు. కొవ్వూరులో గురువారం ప్రకృతి సాగుపై శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆమె సాగుపద్ధతుల గురించి వివరించారు. శాస్త్రవేత్త బండి నాగేంద్ర మాట్లాడుతూ ప్రకృతి సాగులో 9 రకాల ప్రాథమిక సూత్రాలను కచ్చితంగా పాటిస్తే రైతులు మంచి దిగుబడులు, లాభాలు పొందవచ్చన్నారు. రైతు నాయకుడు యర్రంశెట్టి రాజారావు, మాజీ సర్పంచ్ కె.ఈశ్వరరావు, అభ్యుదయ రైతు బంటు రాజు పాల్గొన్నారు.

చీడికాడ: ప్రకృతి సాగుపై గురువారం కోనాంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం ఎస్ఎఫ్ఏ పి.నాగమణి మాట్లాడుతూ ఖరీఫ్‌లో 30 రకాలకు సంబంధించి నూనె గింజలు, కూరగాయ విత్తనాలు, అపరాలు, ఆకుకూరలు, దుంపజాతి విత్తనాలు వేసి 40 రోజుల తర్వాత కలియదున్నాలన్నారు. కార్బన్ శాతం మెరుగుపడి భూ మి గుల్లబారి వానపాములు వృద్ధి చెందేందుకు ఉపకరిస్తుందన్నారు. ప్రతి రైతు ఈ పద్ధతి పాటిస్తే అటు నేలకు ఇటు మనిషికి ఆరోగ్యం లభిస్తుందన్నారు.

వీరనారాయణంలో ఫ్రీ హోల్డ్ పట్టాల పంపిణీ


ఫ్రీ హోల్డ్ పట్టాలు అందజేస్తున్న ఎంపీపీ రాజారామ్

మాడుగుల రూరల్: వీరనారాయణం సచివాలయంలో 43 మందికి ఫ్రీ హోల్డ్ పట్టాలను ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ గురువారం పంపిణీ చేశారు. దశాబ్దాలుగా అమ్ముకునే హక్కు లేక ఎంతో మంది రైతులు ఇబ్బందులు పడ్డారన్నారు. ఇప్పుడు ఈ సమస్యను ప్రభుత్వం పరిష్కరించిందన్నారు. సర్పంచ్ యల్లపు కొండప్పారావు, ఎంపీటీసీ సభ్యురాలు దాడి నూకరత్నం, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి విస్సారావు రామారావు, మాజీ సర్పంచ్ సత్యంబాబు, పీఏసీఎస్ సీఈవో సత్యనారాయణ, నాయకులు దాసరి రాజు, వీఆర్వో కుదర రవిరాంబాబు, పంచాయతీ కార్యదర్శి ఇ. శంకర్ పాల్గొన్నారు.

60 లీటర్ల సారా, బెల్లం పులుపు స్వాధీనం

బుచ్చెయ్యపేట: మండల శివారు పంచాయతీ నీల కంఠాపురంలో సారా బట్టీలపై పోలీసులు గురువారం దాడి చేశారు. సారా తయారీ చేస్తున్న గ్రామానికి చెందిన పడాల నాయుడును అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 60 లీటర్ల సారాతోపాటు 500 లీటర్ల బెల్లం ఊటను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ డి. ఈశ్వరరావు తెలిపారు. బెల్లం ఊటను పారబోసి, సారా తయారీకి వినియోగించే పరికరాలను ధ్వంసం చేశామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు.

నాడు - నేడు పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి


సూచనలు చేస్తున్న ఎంఈవో అమృత్‌కుమార్

నాతవరం: పాఠశాలలో నాడు - నేడు పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఎంఈవో తాడి అమృత్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయంలో సీఆర్పీలు, హెచ్‌ఎంలతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ దశల్లో ఉన్న పనులు ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. పనుల నాణ్యత విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే క్వాలిటీ కంట్రోలు తనిఖీల సమయంలో ఇబ్బందులు వస్తాయన్నారు. మధ్యాహ్న భోజన మెనూలో తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ నెల 18 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేశామన్నారు. 630 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. సీఆర్పీలు పోలుపర్తి నాగేశ్వరరావు, వెంకటలక్ష్మి, సత్యవేణి, అరుణ, జ్యోతి, గోవిందరావు పాల్గొన్నారు.

గీతాంజలి ఆత్మహత్యకు కారకులను శిక్షించాలి

దేవరాపల్లి: తెనాలికి చెందిన గీతాంజలి ఆత్మహత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి డిమాండ్ చేశారు. గీతాంజలి ఆత్మకు శాంతి చేకూరాలని దేవరాపల్లిలో మహిళలతో కలిసి గురువారం రాత్రి ఆమె కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. రామాలయం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించి, జోహార్ గీతాంజలి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను మీడియాకు తెలియజేయడమే నేరమన్నట్లు టీడీపీ, జనసేన మూక సోషల్ మీడియాలో వేధించి నిండు ప్రాణాన్ని బలిగొందన్నారు. తక్షణమే నీచులను ఉరితీయాలని డిమాండ్ చేశారు. జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు గొర్రుపోటు రమాదేవి, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ పాల్గొన్నారు.

పాఠశాల వంటషెడ్డు ప్రారంభం

చీడికాడ: తురువోలు ఉన్నత పాఠశాలలో వంటషెడ్డును సర్పంచ్ మట్టా అప్పారావు గురువారం ప్రారంభించారు. ఇక్కడ మధ్యాహ్న భోజనం వంటకు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో నాడు-నేడు నుంచి రూ.2లక్షలతో దీన్ని నిర్మించామన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి చొక్కాకుల వెంకునాయుడు రూ.3 వేలు పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణకు వితరణగా అందించారు. ఆయన వెంట ఉప సర్పంచ్ పి.టి.బాబు, వైఎస్సార్‌సీపీ నేత ఆర్మీ నాయుడు పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధం కావాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి


ఎన్నికలకు సిద్ధమంటూ విజయ సంకేతం చూపుతున్న చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి, నాయకులు

నర్సీపట్నం: సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి పేర్కొన్నారు. 14వ సచివాలయం బూత్ ఇన్‌చార్జి పెట్ల అప్పలనాయుడు ఆధ్వర్యంలో మేము సిద్ధం మా బూత్ సిద్ధం కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు, బూత్ కన్వీనర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చైర్‌పర్సన్ మాట్లాడుతూ రేపో మాపో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉన్నందున అంతా సమాయత్తం కావాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. జగన్‌తోనే సంక్షేమం సాధ్యమన్న విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలన్నారు. పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ మాట్లాడుతూ ప్రజలను ధైర్యంగా ఓటు అడిగే హక్కు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే ఉందన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చామన్నారు. చేసిన మంచి ప్రజలకు వివరించి ప్రభుత్వానికి మద్దతు కూడగట్టాలన్నారు. నియోజకవర్గ సచివాలయ కన్వీనర్ చెరుకూరి సత్యనారాయణ, పార్టీ సీనియర్ నాయకుడు కర్రి రాంగోపాల్, మున్సిపల్ సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, 23వ వార్డు ఇన్‌చార్జి కణిత అన్నపూర్ణ, కణితి వాసు, 22, 23 వార్డుల నాయకులు పాల్గొన్నారు.

వలంటీర్ల పాత్ర కీలకం


వలంటీర్లను సత్కరిస్తున్న శ్రీనివాస్, తదితరులు

మాకవరపాలెం: సంక్షేమ పథకాలను అందించడంలో వలంటీర్ల పాత్ర కీలకమని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు సర్వేశ్వరరావు అన్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా మాకవరపాలెం సచివాలయంలో గురువారం వలంటీర్లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడంలో వలంటీర్లు ఎంతో కృషి చేశారన్నారు. వారే లేకుంటే ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలతోపాటు ప్రతి నెలా పింఛన్ల పంపిణీకి ఇబ్బందులు ఎదురయ్యేవన్నారు. వారి సేవలను గుర్తించి ప్రభుత్వం అవార్డులను అందించడం హర్షించదగ్గ విషయమన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు చింతకాయల వాసు, కోలా ఈశ్వరరావు, నారాయణమూర్తి, కార్యదర్శి బాలదొర, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పది పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు


పది విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందిస్తున్న శివాజీరాజు, తదితరులు

మాడుగుల రూరల్: ఈ నెల 18వ తేదీ నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయని ఎంఈవోలు ఎం. పాండురంగారావు, బి. దేముడమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఐదు పరీక్ష కేంద్రాల్లో 682 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. తాటిపర్తి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాల కేంద్రంగా 130 మంది, ఒమ్మలి జెడ్పీ హైస్కూలులో 162 మంది, కె.జె.పురం జెడ్పీ హైస్కూలులో 176 మంది, మాడుగుల ఆర్సీఎం బాలికలు, జెడ్పీ బాలికల హైస్కూలు కేంద్రంగా 214 మంది పరీక్షలు రాస్తారన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

కె.కోటపాడు: చౌడువాడ హైస్కూల్‌లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న 151 మంది విద్యార్థులకు పరీక్ష సామగ్రిని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు పంపిణీ చేశారు. వీటిని విశాఖ డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్, మహేష్, శివ సమకూర్చారు. తన తండ్రి దివంగత సత్యనారాయణ 13వ వర్ధంతి సందర్భంగా వీటిని అందించామన్నారు. వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మాజీ డైరెక్టర్ రాజి శ్రీనివాసరావు, కొమార ఈశ్వరరావు, పాల సంఘం అధ్యక్షుడు కొమార వెంకటరమణ, కొమార ఎర్రునాయుడు, చిన్ని చిరంజీవి, ప్రధానోపాధ్యాయుడు ఈర్లి అప్పారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ పంపిణీ

రావికమతం: కొత్తకోట హైస్కూల్‌లో పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉపాధ్యాయుడు గుమ్ముడు కన్నయ్యదొర పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. గురువారం వీటిని హెచ్‌ఎం నాగేశ్వరరావు అందజేశారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు రాసి ఉత్తీర్ణత కావాలని, హైస్కూల్‌కు మంచి గుర్తింపు తేవాలని ఆకాంక్షించారు.

ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ


రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ గూడెపు రాము


చింతపాకలో పట్టాలు పంపిణీ చేస్తున్న నాయకులు

దేవరాపల్లి: జగనన్న కాలనీ లబ్ధిదారులకు ప్రభుత్వం ఉచితంగా ఇంటి స్థలాలను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి అందిస్తుందని సర్పంచ్ గూడెపు రాము అన్నారు. గరిశింగి గ్రామ సచివాలయంలో 20 మందికి వీటిని పంపిణీ చేశారు. కనీవినీ ఎరుగని రీతిలో అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలాలు మంజూరు చేయడంతోపాటు పైసా ఖర్చు లేకుండా రిజిస్ట్రేషన్ చేయించడం చరిత్రాత్మకమన్నారు. పంచాయతీ సెక్రటరీ పి. యశోద, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రజల హృదయాల్లో సీఎం జగన్

బుచ్చెయ్యపేట: స్థలం, ఇళ్లు అందించి పేదోడి సొంతింటి కలను నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రతి ఒక్కరూ గుండెల్లో పెట్టుకోవాలని జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి కోరారు. గురువారం సీతయ్యపేట, చింతపాక, బంగారుమెట్ట, ఎల్.బి.పురం, గున్నెంపూడి, రాజాం, దిబ్బిడి తదితర గ్రామాల్లో జగనన్న కాలనీ లబ్ధిదారులకు ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. మూడు నుంచి ఐదు లక్షల రూపాయల విలువ చేసే ఇంటి స్థలంతోపాటు ఇళ్లు మంజూరు చేయడంతో మండలంలో 1,560 మంది నిరుపేదలు సొంతింటిలో సంతోషంగా ఉంటున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో పేదల సంక్షేమం కోసం కృషి చేస్తున్న తమ ప్రభుత్వాన్ని రెండో సారి గద్దె నెక్కించాలని కోరారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు గొలజాన శ్రీను, ముచ్చకర్ల అప్పారావు, మరిసా నాని, గోపిశెట్టి శ్రీను, సాయం రమేష్, యెనుముల వాసు, తమరాన శ్రీను, రమణ పాల్గొన్నారు.

గిరి గ్రామాల రోడ్ల నిర్మాణానికి రూ.6 కోట్లు మంజూరు

- శంకుస్థాపన చేసిన నాయకులు


దొంకాడ రోడ్డు పనులు కోసం శంకుస్థాపన చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

గొలుగొండ: రెండు ప్రాంతాల్లో ఆరు గిరిజన గ్రామాల రోడ్లకు ఎంపీపీ గజ్జలపు మణికుమారి, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షురాలు లోచల సుజాత గురువారం శంకుస్థాపన చేశారు. రాజుపేట నుంచి డొంకాడ గిరిజన గ్రామానికి రోడ్డు కోసం కోటి రుపాయలు, పీఎస్‌డీపాలెం నుంచి పెసరాడ, అప్పన్నపాలెం, కంఠారం, అడ్డల్లోవ, సుద్దలపాలెం మీదుగా పప్పుశెట్టిపాలెం వెళ్లేందుకు ఐదు కోట్ల రూపాయలు మంజూరయ్యాయి. ఈ నిధులతో ఆరు గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కలుగుతుందన్నారు. ఏళ్ల తరబడి రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో నిధులు మంజూరుకు కృషి చేసిన నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌కు ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.